బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శనివారం 28 సెప్టెంబర్ 2024 www.balagamtv.com


## నేడు హైదరాబాద్ రానున్న రాష్ట్రపతి ముర్ము

బలగం టీవీ, హైదరాబాద్

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం హైదరాబాద్ రానున్నారు. ఈ నేపథ్యంలో బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో పోలీస్, రెవెన్యూ, ఆర్అండ్‌బీ, వైద్య ఆరోగ్యశాఖ, అగ్నిమాపక, అటవీ, విద్యుత్, తదితర శాఖల ఏర్పాట్లపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాకుండా భద్రతా ఏర్పాట్లు, బందోబస్తును పర్యవేక్షించాలని పోలీసులకు సూచించారు. అనంతరం రాష్ట్రపతి నిలయంలో ఏర్పాటు చేసిన 8 రాష్ట్రాలకు సంబంధించిన స్టాళ్లను, నాలుగు ఫుడ్ కోర్టులు, మీడియా సెంటర్, ఇతర స్టాళ్లను పరిశీలించారు.

శామీర్‌పేట లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయలో శనివారం జరిగే 21వ స్నాతకోత్సవంలో ముఖ్యఅతిథిగా ద్రౌపది ముర్ము హాజరవుతున్నారు. గౌరవ అతిథిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, నల్సార్ చాన్సలర్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే, అలాగే సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నర్సింహులు విచ్చేస్తున్నట్లు విశ్వవిద్యాలయ వీసీ క్రిష్ణదేవరావ్ మీడియాకు వెల్లడించారు.



## మూసీ నది ప్రక్షాళనకు సర్వే

- రెండో రోజు కొనసాగిన మూసీ మార్కింగ్ ప్రక్రియ

బలగం టీవీ, హైదరాబాద్

మూసీ నది ప్రక్షాళన కోసం చేపట్టిన సర్వే ఉద్రిక్త పరిస్థితుల మధ్య సాగింది. నిర్వాసితులు సర్వే అధికారులను అడ్డుకోవడమే కాకుండా ఖాళీ చేయించేందుకు తీసుకొచ్చిన డీసీఎం వ్యాన్లను తిప్పి పంపించారు. అడుగడుగునా అధికారులతో వాగ్వాదానికి దిగుతూ ఇళ్లు ఖాళీ చేసేదే లేదని నినాదాలు చేశారు. లంగర్‌హౌస్, బహదూర్‌పురాలో పెద్దసంఖ్యలో బాధితులు రోడ్డెక్కి ఆందోళనకు దిగారు. న్యూ మారుతీనగర్‌లో స్థానికులు సర్వే అధికారులపై తిరగబడ్డారు. స్థానికులకు మద్దతుగా ఎంపీ ఈటల రాజేందర్ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మరోవైపు నిర్వాసితులను రెండు పడక గదుల ఇళ్లకు తరలించేందుకు జీహెచ్?ఎంసీ 14 మంది హౌసింగ్ సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు.

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలోని మూసీ నది గర్భంలో ఉన్న నిర్మాణాలు, నివాసాలను తొలగించేందుకు ఆయా జిల్లాల రెవెన్యూ అధికారులు సర్వే కొనసాగించారు. నది గర్భంలో ఉన్న నిర్వాసితులకు నచ్చజెబుతూ మార్కింగ్ వేసేందుకు యత్నించారు. చైతన్యపురి పరిధిలోని వినాయక్‌నగర్, సత్యనగర్, వెంకటసాయి నగర్, మారుతీ నగర్, ఫణిగిరి నగర్, రాజేంద్రనగర్, నాంపల్లి మండల పరిధిలో పురానాపూల్ దర్వాజా, గోల్కొండ మండల పరిధిలో లంగర్ హౌస్, బహదూర్‌పురా మండల పరిధిలోని కాశీబుగ్గ టెంపుల్, జియాగూడ, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాల్లో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. చైతన్యపురిలో నివాసితులకు, రాజకీయ నాయకులు తోడవడంతో ఆందోళన మరింత ఉద్రిక్తతలకు దారి తీసింది. అధికారులు ఇంటికి మార్క్ వేయడానికి రాగా ఓ వ్యక్తి కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు.

సర్వే చేసేందుకు వచ్చిన అధికారులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్కింగ్ చేయకుండా అడ్డుకున్నారు. నదికి సమీపంలోని నివాసాల వద్ద పెద్ద సంఖ్యలో మహిళలు బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారికి మద్దతుగా మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ అక్కడికి చేరుకొని రోడ్డుపై బైఠాయించి సీఎంపై మండిపడ్డారు. మూసీ ప్రక్షాళన పేరుతో రేవంత్ రెడ్డి రాజకీయం చేస్తున్నారని విమర్శించారు.

రాజేంద్రనగర్ మండల పరిధిలో రివర్ బెడ్‌లో అధికారులు ఐడెంటిఫికేషన్ మార్క్ వేయడానికి రాగా.. రివర్ బెడ్, బఫర్ జోన్‌లో ఉన్నవారు ఆందోళనలు చేశారు. దాంతో పోలీసు బందోబస్తు మధ్య ఇండ్లకు స్టాంప్‌లు వేశారు.నాంపల్లి మండల పరిధిలో ఇమ్లీబన్ బస్టాండ్ నుంచి చాదర్‌ఘాట్ బ్రిడ్జి తదితర ప్రాంతాల్లో అధికారులు మార్కింగ్ ప్రక్రియ నిర్వహించారు. అయితే, పురానాపూల్ దర్వాజా, కాశీబుగ్గ టెంపుల్ వద్ద మూసీ నివాసితులు అందోళనలకు దిగారు. అధికారులు సముదాయించినా రోడ్డుపై బైఠాయించి, నిరసన తెలియచేశారు. జియాగూడ పరిధిలోని మూసి రివర్ బెడ్‌లో మార్కింగ్ చేస్తుండగా బాధితులు సుమారు వందకు మందికిపైనే పటేల్ హెూటల్ వద్ద ఆందోళన చేపట్టారు. దీంతో అక్కడ కొంత ఉద్రిక్తత పరిస్థితి నెలకొనగా.. పోలీసులు వచ్చి ఆందోళన కారులను సర్దిచెప్పారు.

బహదూర్‌పురా నియోజకవర్గం కిషన్ బాగ్, అసద్ బాబా నగర్, నంది ముసలైగూడాలోని స్థానికులు తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు భారీ ర్యాలీగా తరలివచ్చారు. బహదూర్ పురా ఎక్స్ రోడ్ వద్ద ఆందోళనకు దిగి నినాదాలు చేశారు. తమ నివాసాలను కూల్చవద్దని, తమకు రెండు పడకల గదుల ఇళ్లు అవసరం లేదని ఆందోళన ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## పర్యాటక ప్రాంతాలుగా చారిత్రాత్మక భవనాలు

- వాటి పరిరక్షణకు పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలి
- పర్యాటక కేంద్రాలుగా మూసీ పరివాహన ప్రాంతంలో చారిత్రక భవనాలు
- పాత అసెంబ్లీ భవనాన్ని పునరుద్ధరిస్తున్నాం
- ఉస్మానియా ఆస్పత్రి భవనాలు, హైకోర్టు, సిటీ కాలేజీ, పురానాపూల్ బ్రిడ్జి వంటి చారిత్రక కట్టడాలను కాపాడుకోవాలి
- సీఎం రేవంత్ రెడ్డి



బలగం టీవీ, హైదరాబాద్

మూసీ నది పరివాహక ప్రాంతంలో ఉన్న చారిత్రాత్మక భవనాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ సంస్కృతిని ప్రతిబింబించే కట్టడాల పరిరక్షణ కు ముందుకు రావాలని ఆయన పారిశ్రామికవేత్తలకు సూచించారు. హైదరాబాద్‌లోని పలు పురాతన మెట్ల బావుల పునరుద్ధరణ కోసం సీఐఐతో రాష్ట్ర పర్యాటక శాఖ శుక్రవారం ఒప్పందం చేసుకుంది.

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రస్తుతం పాత అసెంబ్లీ భవనాన్ని పునరుద్ధరిస్తున్నామని, త్వరలోనే అందులో శాసన మండలి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం శాసనమండలి ఉన్న జూబ్లీ హాల్‌కు చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు. ప్రత్యేక టెక్నాలజీతో ఆ భవనాన్ని నిర్మించారని, భవిష్యత్తులో దాన్ని పరిరక్షించాల్సిన అవసరముందని సీఎం అభిప్రాయపడ్డారు. జూబ్లీహాల్‌ను దత్తత తీసుకొని పరిరక్షించాలని ఆయన సీఐఐకి సూచించారు. ఉస్మానియా ఆస్పత్రి భవనాన్ని పరిరక్షిస్తామని, ఇందుకోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్ స్టేడియానికి తరలిస్తున్నట్లు సీఎం వివరించారు. హైకోర్టు భవనాన్ని కూడా రక్షించాల్సిన అవసరముందని సీఎం అన్నారు. రాజేంద్రనగర్‌లో హైకోర్టు నూతన భవనం నిర్మాణం కోసం 100 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్ సిటీ కాలేజ్ భవనంతో పాటు పురానాపూల్ బ్రిడ్జి వంటి చారిత్రక కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన అవసరముందన్నారు. ఇప్పటికే చార్మినార్ పరిరక్షణ ప్రాజెక్ట్ కొనసాగుతోందన్నారు.

నగరంలో పురాతన మెట్ల బావులను పునరుద్ధరించి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దడానికి పలువురు పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వారు ఒప్పంద పత్రాలు అందజేశారు. ఉస్మానియా యూనివర్సిటీలోని మహాలఖా మెట్ల బావి పునరుద్ధరణకు ఇన్ఫోసిస్ సంస్థ ఒప్పందం చేసుకుంది. మంచిరేవుల మెట్ల బావిని సాయి లైఫ్ సంస్థ దత్తత తీసుకుంది. భారత్ బయోటెక్ సంస్థ సాలార్ జంగ్, అమ్మపల్లి బావులను పునరుద్ధరించనున్నది. అడిక్‌మెట్ మెట్ల బావిని దొడ్ల డైరీ, ఫలక్‌నుమా మెట్ల బావిని టీజీ ఆర్టీసీ, రెసిడెన్సీ మెట్ల బావిని కోఠి ఉమెన్స్ కాలేజీ పునరుద్ధరించనున్నది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్, సీఐఐ తెలంగాణ ఛైర్మన్ సాయి ప్రసాద్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

## హైడ్రా కమిషనర్‌కు హైకోర్టు నోటీసులు

బలగం టీవీ, హైదరాబాద్

అమీన్‌పూర్ చెరువుకు సంబంధించిన కేసు విషయంలో విచారణ చేపట్టిన తెలంగాణ హైకోర్టు.. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు నోటీసులు జారీ చేసింది. హైడ్రా కమిషనర్ సోమవారం విచారణకు హాజరు కావాలని కోర్టు ఆదేశించింది. అమీన్‌పూర్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందని ఇటీవల ఓ భవనాన్ని హైడ్రా సిబ్బంది కూల్చేశారు. అయితే కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని చెప్పినా పట్టించుకోకుండా కూల్చేశారని బాధితుడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైడ్రా కమిషనర్ వివరణ ఇవ్వాలని కోర్టు సూచించింది. నేరుగా లేదా ఆన్‌లైన్ విచారణకు హాజరు కావాలని హైడ్రా కమిషనర్‌ను కోర్టు ఆదేశించింది.



## హైడ్రా భయం.. మహిళ ఆత్మహత్య..!

బలగం టీవీ, హైదరాబాద్



కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో హైడ్రా హడల్‌కి ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి యాదవ బస్తీలో గుర్రంపల్లి బుచ్చమ్మ అనే మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ముగ్గురు బిడ్డల పెళ్లిళ్లకు కట్నంగా మూడు ఇండ్లు రాసిచ్చింది.అయితే హైడ్రా కూల్చివేతల్లో భాగంగా ఇండ్లు ఖాళీ చేయాలని హైడ్రా అధికారులు ఇటీవలే హెచ్చరించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బుచ్చమ్మ శుక్రవారం ఉరేసుకుని చనిపోయింది. హైడ్రా అధికారుల వేధింపుల కారణంగానే బుచ్చమ్మ ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. కుమారులు లేనప్పటికీ.. తన ముగ్గురు కుమార్తెలు మంచిగా ఉండాలనే ఉద్దేశంతో రూపాయి రూపాయి కూడబెట్టి ఈ ఇల్లును కొనుక్కున్నది. బిడ్డల పెళ్లిళ్లకు కట్నం కింద రాసిచ్చింది. ఇప్పుడు ఇల్లు కూల్చేస్తాం అనేసరికి ఆవేదనకు గురై ఆత్మహత్య చేసుకుందని ఆమె బంధువులు తెలిపారు.

## ఏసీబీకి చిక్కిన నలుగురు

బలగం టీవీ, హైదరాబాద్

నలుగురు ప్రభుత్వ అధికారులు లంచం తీసుకుంటుండగా ఏసీబీ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుంది. జనగాం జిల్లాలోని రోడ్లు, భవనాల శాఖ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చిలుకపాటి హుస్సేన్, అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ అడవాల రవీందర్‌లు వరుసగా రూ.12,000, రూ.2,000 లంచం డిమాండ్ చేశారు. వారు ఆ డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.కాగా.. ఎన్ఓసి జారీకి, వరంగల్ పోలీస్ కమిషనర్‌కు రిమార్క్‌లను ఫార్వార్డ్ చేయడానికి, లింగాల ఘణపూర్ గ్రామంలో కొత్త పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయడం కోసం నిందితులు లంచం డిమాండ్ చేశారు. హుస్సేన్ నుంచి రూ.12వేలు, ఏఈఈ కార్యాలయం నుంచి రూ.2వేలు లంచం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు అధికారులను అరెస్టు చేశారు.

రంగారెడ్డిలోని రెసిడెన్షియల్ పాఠశాల మరో ఘటనలో రంగారెడ్డి జిల్లాలోని సరూర్ నగర్‌లోని విక్టోరియా మెమోరియల్ హెూమ్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ వి ప్రభుదాస్.. రూ.29వేలు లంచం డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ వర్క్ తో పాటు బిల్లును ప్రాసెస్ చేయడం కోసం డబ్బులు డిమాండ్ చేశాడు. ఫిర్యాదు దారుడి నుంచి డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నిందితుడైన అధికారి నుంచి లంచం స్వాధీనం చేసుకున్నారు.నిందితుడిని అరెస్టు చేసి హైదరాబాద్‌లోని నాంపల్లిలోని ఎస్పీ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు.సంగారెడ్డిలో పంచాయతీ కార్యదర్శి సంగారెడ్డి జిల్లా కొండాపూర్ గ్రామం %ఆ% మండల పంచాయతీ కార్యదర్శి ఎండీ షకీల్ నివాస ధృవీకరణ పత్రం ఇవ్వడానికి రూ. 5,000 లంచం డిమాండ్ చేశాడు. ఆ డబ్బులు బాధితుడి నుంచి తీసుకుంటుండగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు.కాగా.. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం అడిగితే 1064 (టోల్‌ఫ్రీ నంబర్)కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు ప్రజలను కోరారు.

## జీహెచ్ఎంసీ కీలక నిర్ణయం

- హైదరాబాద్‌లో పోస్టర్లు, బ్యానర్లు, కటౌట్లపై నిషేధం

బలగం టీవీ, హైదరాబాద్

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ నగరంలో పోస్టర్లు, బ్యానర్లు, కటౌట్లపై నిషేధం విధిస్తూ జీహెచ్ఎంసీ ఉత్తర్వులు జారీ చేసింది. వాల్ పోస్టర్లు, వాల్ రైటింగ్స్‌పై కూడా నిషేధం విధించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది జీహెచ్ఎంసీ. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ అధికారులు హెచ్చరించారు.

## డిప్యూటీ సీఎం ఇంట్లో చోరీ..

- ఇద్దరు నిందితులు అరెస్టు

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఇంట్లో చోరీ జరిగింది. ఈ మేరకు నిందితులను పోలీసులు పట్టుకున్నారు. హైదరాబాద్ బంజారాహిల్స్ లోని రోడ్ నెంబర్ 14లో ఉన్న డిప్యూటీ సీఎం ఇంట్లో నిందితులు చోరీకి పాల్పడ్డారు. ఆ తర్వాత రాష్ట్రం వదిలి పారిపోయారు. వెస్ట్ బెంగాల్ లోని ఖరగ్ పూర్ రైల్వే స్టేషన్ లో నిందితులను అరెస్ట్ చేశారు. వారిని బీహార్ కు చెందిన రోషన్ కుమార్ మండల్, ఉదయ్ కుమార్ ఠాగూర్ గా గుర్తించారు. నిందితుల నుంచి 2లక్షల 20వేల రూపాయల క్యాష్, 100 గ్రాముల బంగారం, విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు.

డిప్యూటీ సీఎం ఇంట్లో చోరీ జరగగా... ఇంట్లో పని చేసే వ్యక్తే చోరీకి పాల్పడినట్లుగా పోలీసులు గుర్తించారు. ఫిర్యాదు అందిన వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. నిందితులను బెంగాల్ లో పట్టుకున్నారు. వారి నుంచి చోరీకి గురైన వస్తువులను సైతం రికవరీ చేశారు. స్థానిక కోర్టులో నిందితులను హాజరుపరిచి.. హైదరాబాద్ కు తీసుకొస్తున్నారని తెలిసింది.



## హైదరాబాద్‌కు పెట్టుబడులతో తరలిరండి



- హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో మరిన్ని అవకాశాలు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

బలగం టీవీ, హైదరాబాద్

హైదరాబాద్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, పునరుత్పాదక విద్యుత్, వస్తు ఉత్పత్తిలో ఎంతో ముందు చూపుతో పురోగమిస్తున్న రాష్ట్రం తెలంగాణ అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. అమెరికన్ కంపెనీల భాగస్వామ్యాన్ని సహకారాన్ని కోరుతోందని, గ్లోబల్ సిటీ హైదరాబాద్ కు పెట్టుబడులతో తరలిరావాలని తెలంగాణ అమెరికన్ కంపెనీలకు పిలుపునిచ్చారు.

అమెరికాలోని లాస్ వెగాస్ లో జరుగుతున్న మైన్ ఎక్స్‌పో 2024 అంతర్జాతీయ సదస్సులో ఆయన ప్రపంచ వ్యాప్త వ్యాపార దిగ్గజ కంపెనీల ప్రతినిధులు, ప్రముఖ అమెరికన్ కంపెనీల ప్రతినిధుల సమావేశాలలో ఆయన మాట్లాడారు. భారతదేశ ఆర్థిక పురోగతిలో అమెరికన్ కంపెనీలు కీలక పాత్ర పోషించాయని, ముఖ్యంగా తెలంగాణలో దిగ్గజ కంపెనీలైన మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్, ఫేస్ బుక్, ఆపిల్ సంస్థలు హైదరాబాద్ ను తమ స్వస్థలంగా భావిస్తూ.. వ్యాపారాలు నిర్వహిస్తున్నాయని తద్వారా హైదరాబాద్ గ్లోబల్ ఐటీ కేంద్రంగా, ఇన్నోవేషన్ హబ్ గా రూపుదిద్దుకున్నదని తెలిపారు.రాష్ట్రప్రభుత్వ వ్యాపార అనుకూల విధానాలు, నైపుణ్యం గల మానవ వనరులు, చక్కని మౌలిక సదుపాయాలు గల హైదరాబాద్ సిటీ పెట్టుబడులకు స్వర్గధామం కానున్నదని కనుక అమెరికన్ కంపెనీల వారు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకొంటూ పెట్టుబడులతో తరలిరావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా హైదరాబాద్ ప్రత్యేకతను వివరిస్తూ ఈ మహానగరం టెక్నాలజీ హబ్ గానే కాకుండా ఫార్మాసిటీ రంగంలో గ్లోబల్ లీడర్ గా ఉంటుందన్నారు. కరోనా విపత్కర సమయంలో డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, అరబిందో ఫార్మా, బైలాజికల్-ఇ, భారత్ బయోటెక్ వంటి కంపెనీల ఆవిష్కరణలతో "వ్యాక్సిన్ క్యాపిటల్ ఆఫ్ ద వరల్డ్" గా, ఈ నగరం ప్రపంచ ఖ్యాతి గడిచిందన్నారు.

ఐటీ అభివృద్ధిలో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగంతో హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ ఆవిష్కరణ జరుగుతోందని, ఇక్కడ ఏ.ఐ. తో నిర్వహించే పరిశ్రమలు, ఏ.ఐ. అభివృద్ధి, స్మార్ట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, గ్రీన్ ఎనర్జీ ఆవిష్కరణలకు పెద్ద పీట వేస్తున్నామని, ఈ విభాగాల్లో ఆసక్తిగల, అనుభవం ఉన్న ప్రపంచవ్యాప్త కంపెనీలకు తెలంగాణ స్వాగతం పలుకుతుందన్నారు.ఈ సందర్భంగా ఆయన తెలంగాణలో పెట్టుబడులకు గల అవకాశాలను కూడా వివరించారు. తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు అనుకూలంగా ఇంధన మరియు పారిశ్రామిక విధానాలు రూపొందించడం జరిగిందని, కొత్త ఆవిష్కరణలకు, ఆర్థికాభివృద్ధికి ముఖ్యంగా పునరుత్పాదక విద్యుత్ అభివృద్ధికి ఎక్కువ అవకాశాలుంటాయన్నారు.

హైదరాబాద్ లో ఇప్పటికే ఉన్న అమెరికన్ కంపెనీలకు ఇక్కడ సానుకూల వాతావరణం, నైపుణ్యం గల మానవ వనరులు, అత్యుత్తమ మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఫ్యూచర్ సిటీలో నెక్స్ట్ జనరేషన్ టెక్నాలజీని వృద్ధి చేయడానికి, నిలకడగల అభివృద్ధికి దోహదం చేసే సొల్యూషన్స్ కు ఎక్కువ అవకాశాలున్నాయన్నారు. హైదరాబాద్ లో నైపుణ్యత గల మానవ వనరులకు కొదవలేదని, పర్యావరణహిత పునరుత్పాదక ఎనర్జీ మరియు గ్రీన్ టెక్నాలజీలకు, సంబంధిత పరిశ్రమలకు అవకాశం మెండుగా ఉంటుందన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి తో పాటు ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సిఎండీ ఎన్.బలరామ్, స్పెషల్ సెక్రెటరీ కృష్ణ భాస్కర్ ఇంకా ఇతర అధికారులు పాల్గొన్నారు.మైనెక్స్ 2024 లో గురువారం నాడు (సెప్టెంబర్ 26) ఆయన ఆస్ట్రేలియాకు చెందిన డోపల్ మేర్ కంపెనీ స్టాల్ ను సందర్శించారు. ఈ కంపెనీ రూపొందించిన అత్యాధునిక బొగ్గు మరియు ఓవర్ బర్డెన్ రవాణా బెల్టులను, వాటి పనితీరును పరిశీలించారు. సౌత్ ఆఫ్రికా, స్విజర్లాండ్, గ్యాటిమల వంటి దేశాలలో తమ కంపెనీ బెల్టులతో జరుగుతున్న రవాణా ప్రక్రియను స్టాల్ నిర్వాహకులు వివరించారు.



## మంత్రి పొంగులేటి ఇండ్లు, ఆఫీసుల్లో ఈడీ సోదాలు..

బలగం టీవీ, హైదరాబాద్

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్?రెడ్డి నివాసాలు, ఆఫీసుల్లో ఈడీ సోదాలు జరిగాయి. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని నివాసంతోపాటు 16 చోట్ల ఏకకాలంలో ఈడీ అధికారులు దాడులు నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి ఆయన నివాసంతోపాటు, హిమాయత్‌నగర్‌లోని ఫామ్‌హౌస్‌లోనూ సోదాలు చేస్తున్నారు. అదేవిధంగా జూబ్లీహిల్స్‌లోని పొంగులేటి కుమార్తె ఇంటితోపాటు ఆయన బంధువుల ఇండ్లలోనూ తనిఖీలు చేస్తున్నారు. 16 బృందాలుగా విడిపోయి ఈడీ సోదాలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. జూబ్లీహిల్స్?లోని నివాసంలో రెండు బృందాలు తనిఖీ చేస్తున్నాయి.

కాగా, గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ పొంగులేటి నివాసాలు, ఆఫీసులపై ఈడీ, ఐటీ అధికారులు దాడులు నిర్వహించిన విషయం తెలిసిందే. గతేడాది నవంబర్ 3న ఖమ్మం పట్టణంలోని ఆయన నివాసాలతోపాటు హైదరాబాద్‌లోని నందగిరిహిల్స్‌లో ఉన్న ఇంట్లో సోదాలు చేశారు. అదేవిధంగా బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10లో రాఘవా ప్రైడ్‌లోనూ తనిఖీలు నిర్వహించారు.

# స్వచ్ఛతలో అందరూ భాగస్వాములు కావాలి

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ..
- ఖైరతాబాద్‌లో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్



**నవతెలంగాణ-బంజారా హిల్స్**

స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛత సాధ్యమవుతుందని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. స్వచ్ఛతలో అందరూ భాగస్వాములు కావాలని సూచించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగాశుక్రవారం ఖైరతాబాద్ లోని ఇందిరానగర్ కాలనీలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో గవర్నర్ పాల్గొన్నారు. ముందుగా ఇందిరానగర్ కాలనీలో పర్యటించి కాలనీ స్థితిగతులను, పారిశుధ్య నిర్వహణ ను పరిశీలించారు.

ఈ సందర్భంగ గవర్నర్ మాట్లాడుతూ మన ఇల్లు, పరిసరాలు మన బస్తి, మన గ్రామం, మన రాష్ట్రం,మన దేశం పరిశుభ్రంగా స్వచ్ఛతతో సురక్షితంగా ఉండాలన్నారు. మన హక్కుల తో పాటు బాధ్యతలు ఉంటాయని, స్వచ్ఛ సురక్షిత సమాజం కోసం ప్రతి ఒక్కరు తమ వంతు సహకారాన్ని అందించాలన్నారు. ప్లాస్టిక్‌ను వినియోగించరాదని,పూర్తిగా నిషేధించినప్పుడే భవిష్యత్తు బాగుంటుందన్నారు. మన పని మనం చేసినప్పుడే ప్రభుత్వ మద్దతు లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరికి స్వచ్ఛతపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. స్వయం గా ప్రతి ఒక్కరూ పరిశుభ్రత సేవ చేయాలని, స్వచ్ఛత దేశ సేవలో ఒక బాగమన్నారు. సమాజాభివృద్ధికి స్వచ్ఛత కార్యక్రమం అవసరమని చెప్పారు. స్వచ్ఛతపై ఒకరి నుండి ఒకరికి అవగాహన కలగాలని, అందరినీ జాగృతం చేయాలని కోరారు. ఇందిరానగర్ కాలనీ స్వచ్ఛతతో సుందరంగా తీర్చి దిద్దితే కాలనీ ప్రజలు సురక్షితంగా ఉంటారని పేర్కొన్నారు. ఇందిరా కాలనీ ఇతర బస్తీలకు మార్గదర్శకం కావాలని, అందుకు అందరూ సహకరించాలని గవర్నర్ కోరారు.

ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్రా వెంకటేశం మాట్లాడుతూ రాజ్ భవన్ కు సెక్రటేరియట్ కు చాలా దగ్గరగా ఉన్న ఈ కాలనీని స్వచ్ఛతలో అభివృద్ధి సాధించేలా గవర్నర్ ఇందిరానగర్ కాలనీ ని దత్తత చేసుకున్నారని తెలిపారు. కాలనీ స్వచ్ఛతతో పాటు కాలనీలోని ప్రతి ఇంటిని అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గవర్నర్ కార్యాలయం నుండి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఇందిరానగర్ కాలనీలోని ఇంటింటికి వచ్చి ఏ సమస్యలు ఉన్నాయన్నది తెలుసుకుని, కుటుంబ స్థితిగతులపై వివరాలు సేకరించి, ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చో ఆదిశగా, ప్రతి ఇంటిని అభివృద్ధి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటారన్నారు. రానున్న ఆరు నెలల్లో కాలనీ రూపు రేఖలు మారాలని, స్వచ్ఛతకు మరో పేరుగా ఉండాలన్నారు. ఆ దిశగా కాలనీవాసులు కృషి చేయాలని కోరారు.

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాటా, మాట్లాడుతూ స్వచ్ఛ హి సేవ కార్యక్రమాన్ని నగరంలో పాఠశాల కలశాల విద్యార్థులకు ప్రజల కు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా శానిటేషన్ కార్మికులకు వైద్య శిబిరాలు ఏర్పాటు సంక్షేమం పై దృష్టి పెట్టినట్టు చెప్పారు. కార్పొరేటర్ విజయ రెడ్డి మాట్లాడుతూ, స్వచ్ఛత కార్యక్రమానికి గవర్నర్ రావడం ఆనందంగా ఉందని అన్నారు. స్వచ్ఛత కార్యక్ర మం వచ్చాక ప్రజల్లో చాలా అవగాహన వచ్చి మార్పు వస్తుందన్నారు. సచ్చితకు జీహెచ్ఎంసీ చేస్తున్న కృషికి ఆమె ధన్యవాదాలు తెలిపారు. చేయడానికి గవర్నర్ మద్దతు తో కాలనీ మరింత అభివృద్ధి చెందుతుందని ఆశించారు.

అంతకుముందు గవర్నర్ అందరితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. వాలంటీర్లు ఫ్లాష్ మాబ్ పర్ఫామెన్స్ చేశారు. ఈ కార్యక్రమం లో జాయింట్ సెక్రెటరీ భవాని శంకర్, అడిషనల్ కమిషనర్ రఘు ప్రసాద్, జోనల్ కమిషనర్ రవి కిరణ్, శానిటేషన్ సిబ్బంది, కాలనీ ప్రజలు, మహిళలు, ఎన్జీవోలు, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివి



- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు మరువలేనివని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కొనియాడారు. ఆచార్య కొండా లక్ష్మణ్ జయంతి వేడుకలను బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఐ డిఓసి లో నిర్వహించగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ హాజరై ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఇక్కడ బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి రాజ మనోహర్, ఆయా శాఖల ఉన్నతాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం...

- అదనపు ఎస్పీ చంద్రయ్య

**బలగం టీవీ , సిరిసిల్ల**

ఆచార్య శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని,బాపూజీ ఆశయాల మేరకు వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం ప్రభుత్వం విశేష కృషి చేస్తుందని అదనపు ఎస్పీ చంద్రయ్య అన్నారు.శుక్రవారం ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చిత్ర పటానికి అదనపు ఎస్పీ చంద్రయ్య పూలమాల వేసి నివాళులు అర్పించినారు.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యోద్యమం, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో అలుపెరగని పోరాటం చేసి తన జీవితాన్నే అంకితం చేశారని అన్నారు.నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి స్వశక్తితో ఎదిగిన మహోన్నత వ్యక్తి ఆచార్య శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ అని, ఆయన సమాజానికి ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ మురళి కృష్ణ, ఆర్.ఐ లు మధుకర్, రమేష్, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

**నవతెలంగాణ-బంజారా హిల్స్**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గీతం విశ్వ విద్యాలయంలో బిటెక్ ద్వితయ సంవత్సరం (సిఎస్‌సి) చదువుతున్న వర్ష (19) ఆత్మహత్యతో గీతం విశ్వ విద్యాలయంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానిక సిఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు రాయలసీమ అనంతపురంకు చెందిన వర్ష గీతం విశ్వ విద్యాలయంలోని హాస్టల్‌లో ఉంటూ బిటెక్ ద్వితీయ (సిఎస్‌సి) సంవత్సరం చదువుకుంటుంది. కాగా శుక్రవారం మధ్యాహ్నం సమయంలో తన రూం మెట్ బయటకు వెళ్లింది. రూంమెట్ బయటకు వెళ్లిన సమయంలో చదువుకుంటుంది.అయితే తన రూంమెంటు తిరిగి సుమారు 0.45 నిముషాల తర్వాత తన గదికి వచ్చింది.

అప్పటికే రూం గది మూసుకొని ఉండడంతో సహ విద్యార్థిని తలపు తీయడానికి ప్రయత్నించడంతో రాకపోడంతో సెక్యురిటీ సిబ్బంది వచ్చి తలుపు తీశారు. అప్పటికే వర్ష గదిలోని ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఉన్న విషయాన్ని గమనించి హుటాహుటినా సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.అయితే అప్పటికే వర్ష మృతి చెందినట్టు డాక్టర్లు తెలిపడంతో మృతదేహాన్ని పటాన్ చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా విద్యార్థిని తల్లిదండ్రులు అనంతపూర్ నుంచి రావాల్సి ఉందని వారు వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలుస్తాయని సిఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు.

## సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వహించాలి..



**అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్**

**బలగం టీవీ , సిరిసిల్ల :**

బెటాలియన్ అధికారులు మరియు సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వహించాలనిఅడిషనల్ డిజిపి సంజయ్ కుమార్ అన్నారు . రాజన్న సిరిసిల్ల జిలాల్లో 17వ పోలీస్ బెటాలియన్ ను అడిషనల్ డిజిపి సంజయ్ కుమార్ జైన్ సందర్శించారు.అంతకుముందు సిరిసిల్ల పట్టణంలోని పంచాయితీ రాజ్ వసతి గృహంలో పుష్పగుచ్చం అందజేసి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్, అదనపు ఎస్పీ చంద్రయ్య,కమాండెంట్ శ్రీనివాస్ రావు, అధికారులు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికినారు.బెటాలియన్ లో నూతనంగా నిర్మించిన ఫ్యాబ్రికేటెడ్ బ్యారెక్స్ ను,గార్డ్ రూమ్, బెటాలియన్ వెల్ఫేర్ కాంప్లెక్స్ అర్చిని పోలీస్ అధికారులతో కలసి ఆడిషనల్ డిజిపి సందర్శించారు.అనంతరం నిర్మాణంలో ఉన్న బెల్ ఆఫ్ ఆర్మ్స్ మరియు కమాండ్ కంట్రోల్ బిల్డింగ్ పనులను పరిశీలించిన అనంతరం నూతనంగా నిర్మించబోయే దోభి మరియు బార్బర్ రూమ్ లకి భూమి పూజ నిర్వహించారు.

ఈ సందర్భంగా అడిషనల్ డిజిపి సంజయ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ క్రమ క్రమశిక్షణ కలిగిన ఆర్గనైజేషన్ అని తెలిపారు. బెటాలియన్ అభివృద్ధిలో ఆఫీసర్లు మరియు సిబ్బంది పాత్ర అభినందించదగినదని అన్నారు.తరువాత బెటాలియన్ అధికారులు ,సిబ్బందితో సమావేశమయ్యి వారి యొక్క యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

కమాండెంట్ శ్రీనివాస రావు మాట్లాడుతూ అడిషనల్ డిజిపి గారు సూచించినటువంటి అన్ని సలహాలు సూచనలు తప్పకుండా పాటిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ లు సాంబ శివరావు,ఉదయభాస్కర్, రామదాసు,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీమతి ప్రమీల,అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## కేరళలో మరో మంకీ పాక్స్ కేసు

**బలగం టీవీ , తిరువనంతపురం**

కేరళలో మరో ఎంపాక్స్ కేసు వెలుగులోకి వచ్చినట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ శుక్రవారం తెలిపింది. ఈ వ్యాధి లక్షణాలు ఉన్నవారు చికిత్స చేయించుకోవాలని కోరింది. శుక్రవారం జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో పరిస్థితిని సమీక్షించినట్లు వివరించింది.ఎంపాక్స్ వ్యాధిగ్రస్థునితో కలసిన వారి జాబితాను తయారు చేశామని, ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టామని మంత్రి వీణా జార్జ్ తెలిపారు. విదేశాల నుంచి రాష్ట్రానికి వచ్చినవారు ఎంపాక్స్ లక్షణాలు కనిపిస్తే, ఆరోగ్య శాఖను సంప్రదించాలని కోరారు. అన్ని జిల్లాల్లోనూ ఐసోలేషన్ సదుపాయాలను కల్పించామన్నారు. దేశంలోనే మొదటి ఎంపాక్స్ కేసు కేరళలోనే ఇటీవల నమోదైంది.

### జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హెూదాను

## పునరుద్ధరించేది ఎన్డీఏ ప్రభుత్వమే



**కేంద్ర మంత్రి , బీజేపీ చీఫ్ జేపీ నడ్డా**

**బలగం టీవీ , హైదరాబాద్**

జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హెూదాను పునరుద్ధరించేది ఎన్డీఏ ప్రభుత్వమేనని కేంద్ర మంత్రి , బీజేపీ చీఫ్ జేపీ నడ్డా చెప్పారు. ఈ విషయాన్ని ఆర్టికల్ 370 ని రద్దు చేసినప్పుడే తాము స్పష్టం చేశామని తెలిపారు. జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. రాష్ట్ర హెూదా ఇస్తామని తాము మాటిచ్చిన విషయాన్నే మేనిఫెస్టోలో చేర్చి కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీలు ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని నడ్డా విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినంత మాత్రాన రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర హెూదా కల్పించే అధికారం ఉండదని గుర్తుచేశారు. రాష్ట్ర హెూదా ఇచ్చే అధికారం కేంద్రానికి మాత్రమే ఉంటుందన్నారు.

## జనగామ జిల్లాలో 15 మంది విద్యార్థులకు అస్వస్థత

**బలగం టీవీ , హైదరాబాద్**




జనగామ జిల్లాలో విద్యార్థులు ఫుడ్ పాయిజన్కు గురయ్యారు. ఏకంగా 15 మంది ఫుడ్ పాయిజన్ కు గురై ఆస్పత్రి పాలు కావడం జరిగింది. జనగామ జిల్లాలోని ఏబీవీ కాలేజీ హాస్టల్ లో ఫుడ్ పాయిజన్ జరిగింది. ఇందులో చదువుతున్న 15 మంది ఇంటర్ విద్యార్థులకు తీవ్ర అస్వస్థత నెలకొనడం జరిగింది.విద్యార్థులకు హాస్టల్ లో ఆర్ఎంపి వైద్యుడు తో రహస్యంగా కూడా చికిత్స అందించారట సిబ్బంది. అయితే నలుగురి పరిస్థితి విషమించడంతో జిల్లా ఆసుపత్రికి తరలించారు.

## గల్ఫ్ కార్మికులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



**గల్ఫ్ లో ఏ కారణం చేతనైనా మరణించిన ఐదు లక్షల ఎక్స్గ్రేషియే..**

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

గల్ఫ్ కార్మికులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంటుందని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ అన్నారు.. శుక్రవారం హైదరాబాద్ జ్యోతిరావు పూలే ప్రజా భవన్ లో ప్రవాసి ప్రజావాణి గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక కౌంటర్ ప్రారంభం చేసిన నేపథ్యంలో సిరిసిల్ల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ గల్ఫ్ కార్మిక శ్రేయస్సు కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని, సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం, గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం సెప్టెంబర్ 17 న జీవోను తీసుకువచ్చారు అని అన్నారు.

హైదరాబాద్ లోని జ్యోతిరావు పూలే ప్రజా భవన్ లో ప్రవాసి ప్రజావాణి గల్ఫ్ కార్మికుల కోసం ప్రత్యేక కౌంటర్ ను బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారని అన్నారు. గల్ఫ్ లో ఏ కారణం చేతనైన మరణించిన, వారి కుటుంబాలకు 5 లక్షల ఎక్స్గ్రేషియా ఇవ్వడం జరుగుతుందని అన్నారు.గల్ఫ్ కార్మికులకు ఏవైనా ఇబ్బంది ఎదురైతే,వారి సమస్యల పరిష్కారం కోసం ఒక సలహా మండలి ఏర్పాటు చేయడం జరిగింది అని అన్నారు.

గల్ఫ్ కార్మికుల పిల్లలకు గురుకులాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది అని,గతంలో ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో గల్ఫ్ లో మృతి చెందిన కార్మికులకు లక్ష ఎక్స్గ్రేషియా ఇస్తే,మళ్లీ రేవంత్ రెడ్డి హయాంలోనే ఇవ్వడం జరుగుతుంది అని అన్నారు.

గతంలో కేసీఆర్, కేటీఆర్ గల్ఫ్ కార్మికులను వాడుకొని బొంబాయి భీమండి మరియు గల్ఫ్ బతుకులేనా,మేం వస్తే గల్ఫ్ కార్మికుల సంక్షేమం 500 కోట్లు కేటాయిస్తామని, మరణిస్తే 5 లక్షలు పరిహారం ఇస్తామని చెప్పి మోసం చేశారని అన్నారు.గత తొమ్మిది సంవత్సరాలలో శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లెక్కల ప్రకారం, సుమారు 2000 పైగా పార్థివదేహాలు వస్తే గత పాలకులు ఒక్క కుటుంబానికి అనా పైసా కూడా ఇవ్వలేదు అని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం 5 లక్షల ఎక్స్గ్రేషియా ఇస్తున్నామని,ఇప్పటికే వేములవాడ నియోజకవర్గానికి చెందిన గల్ఫ్ లో మృతి చెందిన రెండు కుటుంబాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో సిఎంఆర్ఎఫ్ నుండి వ5 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వడం జరిగింది అని అన్నారు.కెసిఆర్ గతంలో రాజన్న ఆలయానికి ఏట 100 కోట్లు ఇస్తానని, ముంపు గ్రామాల ప్రజలకు డబల్ బెడ్రూమ్ ఇస్తారని మోసం చేసాడని అన్నారు.కేటీఆర్ సిరిసిల్ల లో మాట్లాడుతూ ఒక రాజకీయ నాయకుడిగా కాకుండా మనమడిగా వచ్చానని మాట్లాడడం విడ్డూరంగా ఉంది అని,ఇదే ముంపు గ్రామం కొదురుపాక లో చిన్నప్పుడు ఆడుకున్న నువ్వే, అధికారంలో ఉన్నప్పుడు గ్రామస్తులు పడుతున్న బాధలను మీ తండ్రి ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయలేదు అని ప్రశ్నించారు.

గల్ఫ్ కార్మికుల పక్షాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నా,ప్రజా సమస్యల పరిష్కారంలో తెలంగాణ ప్రభుత్వం ముందుంటుందని అన్నారు.

# రెండో టెస్టుకు వర్షం అంతరాయం

- మొదటి రోజు 35 ఓవర్ల ఆటే
- బంగ్లాదేశ్ 107/3




**బలగం టీవీ, కాన్పూర్**

భారత్ – బంగ్లాదేశ్ మధ్య రెండో టెస్టు తొలి రోజు వర్షం అంతరాయం కలిగించింది. మొదటి రోజు 35 ఓవర్లకే ఆట ముగిసింది. కాన్పూర్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో మొదటి రోజు ఆట రద్దయ్యే సమయానికి బంగ్లా 107/3 (35 ఓవర్లు) స్కోర్‌తో ఉంది. క్రీజులో మొమినుల్ హక్ (40 పరుగులు), ముష్ఫికర్ రహీమ్ (6 పరుగులు) ఉన్నారు. తొలి రోజు ఆటలో ఆకాశ్ దీప్ 2, రవిచంద్రన్ అశ్విన్ 1 వికెట్ పడగొట్టారు.

అయితే కాన్పూర్‌లో గురువారం రాత్రి నుంచే వర్షం కురుస్తోంది. దీంతో మైదానం చిత్తడిగా మారింది. అందుకే ఉదయం 9 గంటలకు టాస్ వేయాల్సి ఉండగా, గంట సేపు ఆలస్యం అయ్యింది. ఇక మ్యాచ్ 10.30 గంటలకు ప్రారంభమైంది. 8.3 ఓవర్ వద్ద ఓపెనర్ జకీర్ హసన్‌ను పేసర్ ఆకాశ్ దీప్ డకౌట్ చేశాడు.

కాసేపటికే మరో ఓపెనర్ షద్మన్ ఇస్లామ్ (24 పరుగులు)ను కూడా ఆకాశ్ పెవిలియన్ పంపాడు. అతడిని ఎల్‌బీడబ్ల్యూగా ఔట్ చేశాడు. ఈ దశలో మొమినుల్ హక్, నజ్ముల్ షాంటో (31 పరుగులు) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 51 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అలా నిలకడగా సాగుతున్న ఇన్నింగ్స్‌లో అశ్విన్ షాంటోను వెనక్కి పంపి భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు.ఇక మధ్యాహ్నం తర్వాత ఆటకు వాతావరణం అనుకూలించకపోవడంతో.. తొలి రోజు ఆటను నిలిపివేశారు.

# కేకేఆర్ మెంటార్‌గా బ్రావో



**బలగం టీవీ, ముంబై**

కోల్‌కతా నైట్ రైడర్స్ నయా మెంటార్‌గా వెస్టిండీస్ స్టార్ ఆల్‌రౌండర్ డ్వేన్ బ్రావో బాధ్యతలు అందుకున్నాడు. గౌతమ్ గంభీర్ స్థానంలో బ్రావో ఈ బాధ్యతలు స్వీకరించాడు. గత సీజన్ ఐపీఎల్–2024లో కేకేఆర్ ఛాంపియన్‌గా నిలిచిన విషయం తెలిసిందే.టీమిండియా కోచ్‌గా బాధ్యతలు అందుకోవడంతో గౌతమ్ గంభీర్ కేకేఆర్ మెంటార్ పదవిని వదులుకున్నాడు.

గంభీర్ స్థానంలో చెన్నై సూపర్ కింగ్స్ బౌలింగ్ కోచ్ డ్వేన్ బ్రావోను కేకేఆర్ తాజాగా నియమించింది. కాగా, క్రికెట్‌కు గురువారమే బ్రావో రిటైర్మెంట్ ప్రకటించాడు. పోటీ క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు సీపీఎల్ –2024 మధ్యలోనే వెల్లడించాడు. కరేబియన్ ప్రీమియర్ లీగ్‌లో నైట్ రైడర్స్ ఫ్రాంచైజీ అయిన ట్రింబాగో నైట్ నైడర్స్ తరఫునే బ్రావో ప్రాతినిథ్యం వహిస్తున్నాడు.

అయితే కేకేఆర్‌తో పాటు మేజర్ క్రికెట్ లీగ్‌లో లాస్ ఏంజెల్స్ నైట్ రైడర్స్, ఇంటర్నేషనల్ లీగ్ టీ20లో అబుదాబి నైట్ రైడర్స్‌తోనూ కలిసి బ్రావో పనిచేయనున్నాడు. ఇక ఐపీఎల్‌లో కోచింగ్ బాధ్యతలు అందుకోవడం బ్రావో ఇది రెండోసారి. ఐపీఎల్‌కు 2022లో రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత 2023 నుంచి సీఎస్కే బౌలింగ్ కోచ్ బాధ్యతలు అందుకున్నాడు. మూడు సార్లు ప్లేయర్‌గా సీఎస్కేకే ట్రోఫీ అందించిన బ్రావో 2023లో కోచ్‌గా టైటిల్ సాధించాడు.



## ‘హ్యారీ పోటర్’ నటి మృతి

**బలగం టీవీ, లండన్**

ఎ హాలీవుడ్ చిత్ర పరిశ్రమలో విషాదం చోటు చేసుకుంది. అకాడమీ అవార్డు విజేత, హ్యారీ పోటర్ సినిమా ఫేం ప్రముఖ బ్రిటిష్ నటి మ్యాగీ స్మిత్ కన్నుమూశారు. ప్రస్తుతం ఆమె వయసు 89. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శుక్రవారం ఉదయం లండన్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచినట్లు స్మిత్ కుటుంబ సభ్యులు వెల్లడించారు.

ప్రస్తుతం ఆమె వయసు 89. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శుక్రవారం ఉదయం లండన్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచినట్లు స్మిత్ కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఇక మ్యాగీ స్మిత్ మరణ వార్త తెలుసుకున్న అభిమానులు, పలువురు సినీ సెలబ్రిటీలు నటి మృతిపై సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

## సుదర్శన్ థియేటర్‌లో అగ్ని ప్రమాదం

**బలగం టీవీ, హైదరాబాద్**



హైదరాబాద్ ముషీరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సుదర్శన్ థియేటర్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. శుక్రవారం ప్రముఖ సినీ హీరో జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవరా సినిమా విడుదలైంది. ఈ సందర్భంగా హీరో అభిమానులు ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సుదర్శన్ థియేటర్‌లో భారీ ఎత్తున టాపాకాయలు కలుస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ఆ టపాకాయల నిప్పు రవ్వలు, థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన తారక్ భారీ కటౌట్ పై పడటంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. భారీ ఎత్తున మంటలు ఎగిసిపడి కటౌట్ మొత్తం దగ్ధమైంది. అగ్ని ప్రమాదంలో ఎవ్వరూ గాయపడలేదు. వెంటనే ఫైర్ ఇంజన్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు.



## కాన్పూర్‌లో అనారోగ్యంతో కిందపడిపోయిన బంగ్లాదేశ్ సూపర్ ఫ్యాన్

**బలగం టీవీ, కాన్పూర్**

ఇండియా వర్సెస్ బంగ్లాదేశ్ రెండో టెస్ట్‌కు హాజరైన బంగ్లా సూపర్ ఫ్యాన్ ‘టైగర్ రాబి’పై దాడి జరిగినట్లు జరుగుతున్న ప్రచారం వాస్తవం కాదని కాన్పూర్ పోలీసులు స్పష్టం చేశారు. టైగర్ రాబిని ఎవరూ కొట్టలేదని, అనారోగ్యంతో అతను కిందపడిపోయాడని పేర్కొన్నారు. శుక్రవారం కాన్పూర్ వేదికగా రెండో టెస్ట్ ప్రారంభం కాగా.. టాస్ ఓడిన బంగ్లాదేశ్ బ్యాటింగ్‌కు దిగింది. వర్షం కారణంగా ఈ మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభమైంది. తొలి రోజు ఆట ఆరంభంలో టైగర్ రాబికి, స్థానిక టీమిండియా అభిమానులకు గొడవ జరిగిందని వార్తలు వచ్చాయి. సీ బ్లాక్‌లో ఉన్న రాబి బంగ్లాదేశ్ జాతీయ జెండాను ఊపుతూ.. మద్దతుగా నినాదాలు చేశాడని, దాంతో స్థానిక భారత అభిమానులు తీవ్ర ఆగ్రహానికి గురై అతనితో వాగ్వాదానికి దిగారని, లంచ్ బ్రేక్ సమయంలో టైగర్ రాబీపై బౌతిక దాడికి పాల్పడ్డారని కూడా ప్రచారం జరిగింది.

అస్వస్థతకు గురైన టైగర్ రాబీని పోలీసులు మైదానం బయటకు తీసుకెళ్తున్న వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. అయితే టైగర్ రాబీపై ఎవరూ దాడి చేయలేదని, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారమంతా అవాస్తవమని కాన్పూర్ పోలీసులు స్పష్టం చేశారు.

ఆస్పత్రికి వెళ్లే సమయంలో టైగర్ రాబీ మీడియాతో మాట్లాడుతూ తనపై దాడి చేశారని, పొత్తికడుపుతో వీపుపై బలంగా కొట్టారని, దీంతో ఊపిరి తీసుకోవడం కష్టమైందని తెలిపాడు. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించిన పోలీసులు అతనిపై ఎలాంటి దాడి జరగలేదని స్పష్టం చేశారు. టైగర్ రాబీపై దాడి చేసినట్లు ఎక్కడా కనపించలేదని చెప్పారు.

వార్తల్లో నిలిచేందుకు టైగర్ రాబీ ఇలా ప్రవర్తించడం ఇదే తొలిసారి కాదని, గతంలోనూ అనేక సార్లు స్థానిక అభిమానులతో గొడవకు దిగేందుకు ప్రయత్నించాడని బీసీసీఐకి చెందిన ఓ అధికారి మీడియాకు తెలిపారు. చెన్నై వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లోనూ తమిళం అర్థం కాక అక్కడి ఫ్యాన్స్‌తో గొడవకు దిగాడని గుర్తు చేశారు. ఈ ఘటనను బంగ్లాదేశ్ మీడియా పెద్దదిగా చూపిస్తుందని, టైగర్ రాబీపై ఎలాంటి దాడి జరగలేదని స్పష్టం చేశారు.

# ‘దేవర’లో నా తమ్ముడు కుమ్మేశాడు

**బలగం టీవీ, హైదరాబాద్**



ఎన్టీఆర్ కథానాయకుడిగా, కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన తాజా చిత్రం దేవర. ఈ సినిమా ఫస్ట్ షో నుంచే పాజిటివ్ టాక్‌తో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. ఆరేండ్ల తర్వాత ఎన్టీఆర్ సోలోగా రావడంతో అటు ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ దేవర సినిమా చూసి సంబరాలు చేసుకుంటున్నారు. అయితే ఈ సినిమా సాధించిన విజయం పట్ల దేవర టీం సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ ఈవెంట్‌కు దర్శకుడు కొరటాల శివతో పాటు నటుడు నందమూరి కళ్యాణ్ రామ్, నిర్మాత దిల్ రాజు తదితరులు హాజరయ్యారు.

ఇక ఈ ఈవెంట్‌లో నందమూరి కళ్యాణ్ రామ్ మాట్లాడుతూ.. నాలుగేళ్ల మేం అందరం పడిన కష్టం ఈ దేవర. ఈరోజు మీ ముందుకు వచ్చింది. ఈ సినిమాపై మీరు చూపిస్తున్న ఆదరాభిమానాలకు ఇస్తున్న రికార్డు బ్రేకింగ్ కలెక్షన్స్‌కు మా ప్రేక్షకులకు, నందమూరి అభిమానులకు ధన్యవాదాలు. ఈ సినిమా కోసం టీమ్ ఎంతో కష్టపడి పనిచేసింది. దేవర వరల్డ్‌ను సాబ్ సిరిల్‌కు ధన్యవాదాలు. నా తమ్ముడు, మా నాన్న కుమ్మేశాడు. యాక్టింగ్‌తో అదరగొట్టేశాడు. ఇది వన్ మ్యాన్ షో అని గర్వంగా చెప్పగలను. ఈ సినిమా ఇంతటి విజయం సాధించినందుకు టీమ్‌కు థాంక్యూ అంటూ కళ్యాణ్ రామ్ చెప్పుకొచ్చాడు.

కొరటాల శివ మాట్లాడుతూ “ఇంత పెద్ద విజయాన్ని ఇచ్చిన తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు. మూడేళ్ల కష్టమే దేవర సినిమా. నిన్న రాత్రి నుంచి ఇప్పటి వరకు ఫోన్ కాల్స్ వస్తున్నాయి. నా కెరీర్‌లో బెస్ట్ మూవీ అంట ఎన్నారు. నా నటీనటులు, సాంకేతిక నిపుణులకు స్పెషల్ థాంక్స్. జాన్వీ, శ్రీకాంత్, సైఫ్ అలీఖాన్, రత్నవేలు, సాబు సిరిల్, అనిరుధ్ సహా అందరూ తమ సినిమాగా భావించి చివరి నిమిషం వరకు కష్టపడ్డారు. అందుకే సినిమాకు ఇంత మంచి సక్సెస్ దక్కింది. ఈ జర్నీలో భాగమైన అందరికీ థాంక్స్” అన్నారు.

## అశ్విన్ మరో ఘనత

భారత స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మరో అరుదైన ఘనతను సాధించాడు. ఆసియా గడ్డపై అత్యధిక వికెట్లను సాధించిన రెండో బౌలర్‌గా అశ్విన్ కొత్త రికార్డు నెలకొల్పాడు. ఈ క్రమంలో భారత దిగ్గజ అనిల్ కుంబ్లేను అశ్విన్ వెనక్కి నెట్టాడు. ఇప్పటి వరకు కుంబ్లే 419 వికెట్లతో ఆసియాలో అత్యధిక వికెట్లను పడగొట్టిన రెండో బౌలర్‌గా రికార్డు సృష్టించాడు. తాజాగా అశ్విన్ ఈ రికార్డును అధిగమించాడు. బంగ్లా కెప్టెన్ శాంటో వికెట్‌ను తీయడం ద్వారా అశ్విన్ కొత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. ప్రస్తుతం అశ్విన్ 420 వికెట్లతో ఆసియాలో అత్యధిక వికెట్లను పడగొట్టిన రెండో బౌలర్‌గా నిలిచాడు. మరోవైపు శ్రీలంక దిగ్గజ బౌలర్ ముత్తయ్య మురళీధరన్ 612 వికెట్లతో ఈ జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. కాగా, అశ్విన్ ఇటీవలే టెస్టుల్లో 500 వికెట్ల మైలురాయిని అందుకున్న సంగతి తెలిసిందే.